క్లుప్తంగా

నాణ్యమైన సిమెంటును ఎంచుకోవాలి


భవన నిర్మాణ కార్మికుల సందేహాలను నివృత్తి చేస్తున్న కరుణాకర్, భవానీ శంకర్

అంబాజీపేట: భవన నిర్మాణాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ మార్కెటింగ్ సీనియర్ అధికారి ఎం.కరుణాకర్, టెక్నికల్ సర్వీసెస్ సీనియర్ అధికారి ఎస్.భవానీశంకర్ అన్నారు. అంబాజీపేటలో శివరామ ఐరన్, మెటీరియల్ డీలర్ బంగారం షాపు వద్ద భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యాన భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. భారతి సిమెంటును నాణ్యతతో అందించడం వలన ఎక్కువ మంది ఆదరిస్తున్నారని అన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సందేహాలను నివృత్తి చేశారు. భారతి సిమెంట్ నాణ్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

రాజేష్ ఆర్టికల్‌కు అంతర్జాతీయ గుర్తింపు



మామిడికుదురు: కాకతీయుల చరిత్ర, సంస్కృతి, సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులపై పెదపట్నం గ్రామానికి చెందిన నేదూరి రాజేష్ విశ్లేషించి, రాసిన ఆర్టికల్ అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమైంది. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో చరిత్ర లెక్చరర్‌గా పని చేస్తున్న రాజేష్ రాసిన ఈ ఆర్టికల్‌ను ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్రియేటివ్ రీసెర్చ్ థాట్స్ (ఐజేసీఆర్‌టీ) మాస పత్రిక ప్రపంచ వ్యాప్తంగా ప్రచురించింది. రాజేష్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి చరిత్ర, రాజకీయ శాస్త్రాల్లో పట్టా పొందారు. ప్రముఖ విశ్వ విద్యాలయాల నుంచి పలు సర్టిఫికెట్ కోర్సులు చేశారు. గతంలో పలు బౌద్ధస్థూపాలపై పరిశోధనలు చేసి, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు.

న్యాయం చేయాలని రైతుల వినతి

మామిడికుదురు: తమ పొలాలకు సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని కోరుతూ నగరం రైతులు గురువారం తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం సమర్పించారు. తాటికాయల ఉదయ భాస్కరరావు, బలభద్ర సూర్యమణికంఠ, ఎస్ఎంటీ హుస్సేన్, కె.జయలక్ష్మి తదితరులు తహసీల్దార్‌కు తమ సమస్య విన్నవించారు. మురుగు కాలువ వద్ద ఉన్న భూములకు గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఇటీవల సర్వే చేయించారని చెప్పారు. సరిహద్దు రైతులకు తెలియజేయకుండా సర్వే చేసి, తమ భూముల్లో సర్వే రాళ్లు పాతారన్నారు. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న కొబ్బరి చెట్లు పంచాయతీకి చెందినవిగా పేర్కొనడం దారుణమని అన్నారు. కొబ్బరి చెట్లకు నంబర్లు వేసి, వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ భూములను సర్వే చేయించాలని సరిహద్దు రైతులందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని తెలిపారు. సర్వే పూర్తయ్యే వరకూ కొబ్బరి చెట్లను పంచాయతీ స్వాధీనం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తక్షణ చర్యలకు తహసీల్దార్ ఆదేశించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా వసంతోత్సవ పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో వసంతోత్సవ పూజలు గురువారం వైభవంగా జరిగాయి. అర్చకుడు వాడ్రేవు శంకర్‌ప్రసాద్ ఆధ్వర్యాన వేద పండితులు గంటి శ్రీనివాసరావు బ్రహ్మత్వంలో వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ దుర్గమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, నవదుర్గారాధన, అభిషేకాలు ఘనంగా జరిపించారు. అనంతరం కనకదుర్గమ్మకు లక్ష చామంతి పూలతో అర్చన, లలితా హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

అంబాజీపేట: కె.పెదపూడిలో శ్రీ పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణరాయుడుస్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొత్తలంక విజయభాస్కర్ (బుజ్జి) ఆధ్వర్యాన స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం శ్రీపుష్పయాగం జరిపించారు. భక్తులకు స్వామి వార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా బంగారమ్మ, మావుళ్లమ్మ జాతర

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామంలో శ్రీ బంగారమ్మ, మావుళ్లమ్మ అమ్మవార్ల జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన గరగ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. శుక్రవారం అమ్మవార్ల తీర్థం నిర్వహిస్తున్నామని సభ్యులు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

పి.గన్నవరం: జి.పెదపూడి గ్రామంలోని ఓ పాడుబడిన ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.630 నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు.

పేద బిడ్డలకూ ప్రైవేటు విద్య

- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు
- ప్రతి స్కూలులో 25 శాతం సీట్లు
- రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయింపు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 10 వరకూ అవకాశం


ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న బాలలు

కొత్తపేట: వినూత్న పథకాలతో విద్యారంగాన్ని ఒక క్రమ పద్ధతిలో సంస్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి, పేద విద్యార్థులకూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలనే నిబంధనను పక్కాగా అమలు చేస్తోంది. వారికి 2022–23 విద్యా సంవత్సరం నుంచే ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తోంది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్–12(1), (సి)ని అనుసరించి 2023–24 విద్యా సంవత్సరంలో కూడా 1వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల పిల్లలకు 6 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలకు మించి ఉండరాదు. పట్టణ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేల చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500 ఫీజుగా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అమ్మ ఒడి పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులకు అమ్మ ఒడి డబ్బులతోనే ఫీజు చెల్లిస్తుంది. మిగిలిన సొమ్మును విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల ఖాతాల్లో జమ చేస్తారు.

కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యం

ఫలానా పాఠశాలలోనే తమకు సీటు కావాలంటే వీలు పడదు. విద్యార్థులు నివాసం ఉండే (ఆధార్ చిరునామా ప్రాతిపదిక) ప్రాంతానికి కిలోమీటర్ పరిధిలోని పాఠశాలల్లో సీటు కేటాయించేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాత 3 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలో కేటాయిస్తారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందేందుకు 5 నుంచి 6 సంవత్సరాల బాలబాలికలు అర్హులు. ప్రస్తుతం అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా లేదా సంబంధిత సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంతో ప్రయోజనం



విద్యా హక్కు చట్టాన్ని ఆయా ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. విద్యార్థులకు రెండు విడతలుగా అడ్మిషన్లు కల్పిస్తాం. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

పేద విద్యార్థులకు వరం



విద్యాహక్కు చట్టం పటిష్ట అమలు ద్వారా పేద విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం శుభపరిణామం. ఇది పేద విద్యార్థులకు వరం.

– నేలపూడి భీమరాజు, ఎంపీటీసీ సభ్యుడు, వాడపాలెం

మండలాల్లో ప్రైవేటు పాఠశాలలు

మండలం	పాఠశాలలు
కొత్తపేట నియోజకవర్గం	
కొత్తపేట	13
రావులపాలెం	20
ఆత్రేయపురం	9
ఆలమూరు	20
పి.గన్నవరం నియోజకవర్గం	
పి.గన్నవరం	8
మామిడికుదురు	14
అంబాజీపేట	9
అయినవిల్లి	11
రాజోలు నియోజకవర్గం	
రాజోలు	15
మలికిపురం	20
సఖినేటిపల్లి	15
మొత్తం	154

ఇదీ షెడ్యూల్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 10 వరకూ గడువు.
- 13 నుంచి 17 వరకూ విద్యార్థుల అర్హత నిర్ధారణ.
- 18న లాటరీ ద్వారా మొదటి జాబితా విడుదల.
- 19 నుంచి 25వ తేదీ వరకూ ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు.
- 29న లాటరీ ద్వారా రెండో జాబితా విడుదల.
- మే 1 నుంచి 5వ తేదీ వరకూ రెండో విడత విద్యార్థులకు అడ్మిషన్లు.

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు

- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- నేదునూరులో గడప గడపకూ..


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలందరూ మద్దతు ఇస్తున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నేదునూరులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందని చెప్పారు. మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు ఎమ్మెల్యే చిట్టిబాబు హామీ ఇచ్చారు. నేదునూరు–1లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజలు మెచ్చిన పాలన అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడుతుందని, సీఎం పదవిని ఆయనకే ప్రజలు మరోసారి కట్టబెడతారని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. నేదునూరులో 'మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కరోనా వంటి విపత్తుల సమయంలో సైతం సంక్షేమ పథకాలను సీఎం జగన్ ఎక్కడా ఆపలేదని గుర్తు చేశారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో గృహసారథుల మండల కన్వీనర్ పులిదిండి ప్రభాకర్, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'ను విజయవంతం చేయాలి

అంబాజీపేట: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గృహసారథులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక గృహసారథిని, ముగ్గురు గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లను నియమించామని చెప్పారు. ఒక్కో గృహసారథి రోజుకు 5 నుంచి 10 ఇళ్లను సందర్శించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ఎలా ఉంది, సంక్షేమ పథకాల అమలు, పాలనపై ప్రజాభిప్రాయాలు సేకరించి, లబ్ధిదారులు చెప్పిన వాస్తవాలను నమోదు చేసి, ప్రభుత్వానికి అందజేయాలని అన్నారు.

కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: కరోనా కష్టకాలంలోనూ పేదలకు సంక్షేమ పథకాలను యథాతథంగా కొనసాగించిన గొప్ప మనసున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. రామరాజులంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించారు.

అర్హులు ఎవరైనా ఉంటే అక్కడికక్కడే వారికి పథకాల అమలుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావి గోపాలం, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ ప్రాంతంపై వివాదం


జి.పెదపూడిలో సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఆ లంక గ్రామాల ప్రజలు


ఊడిమూడిలంక వద్దే వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తుల ఆందోళన

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం రూ.49.5 కోట్లతో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం అన్ని అనుమతులూ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ వంతెన నిర్మాణ ప్రాంతం విషయమై వివాదం తలెత్తింది. ముందుగా విడుదల చేసిన జీఓ ప్రకారం ఊడిమూడిలంక వద్దే వంతెన నిర్మించాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు వంటావార్పుతో ఆందోళన చేపట్టారు. సహపంక్తి భోజనాలు చేశారు. వంతెన పక్క గ్రామంలో నిర్మిస్తే ఊరుకునేది లేదన్నారు. ఆర్‌పీ రోడ్డుపై ప్రదర్శన నిర్వహించారు. చర్చి వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నినాదాలు చేశారు. ఊడిమూడి సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆదిమూలం సూరయ్యకాపు, అయినపర్తి ఇందిరా ప్రియదర్శిని, స్థానిక నాయకుడు సాధనాల రమేష్ మాట్లాడుతూ, ప్రధాన పంట కాలువపై వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.

సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఇదిలా ఉండగా దశాబ్దాల నాటి వంతెన సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి ఆదుకున్నారంటూ జి.పెదపూడి, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ఇందుకు కృతజ్ఞతగా జగన్ ఫ్లెక్సీని గుర్రపు బండిపై లంక నుంచి ఏటిగట్టు వరకూ ఊరేగించి, క్షీరాభిషేకం చేశారు. వంటావార్పు నిర్వహించారు. నదిపై వంతెన ఎక్కడ నిర్మించినా తమకు అభ్యంతరం లేదని జి.పెదపూడి సర్పంచ్ దంగేటి అన్నవరం, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు తెలిపారు. పనులు తొందరగా ప్రారంభించాలని కోరారు.

డంపింగ్ సమస్యకు సమష్టిగా పరిష్కారం


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: మాచవరం మేజర్ పంచాయతీలో డంపింగ్ సమస్యను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, పెద్దలందరం కలిసి పరిష్కరిద్దామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, బొంతు పెదబాబు అన్నారు. ఈ సమస్యపై అంబాజీపేట కన్యకాపరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన గురువారం అఖిలపక్షం, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. హడ్కో కాలనీ, మాచవరం శివారు ప్రాంతాల్లో చెత్త డంపింగ్ చేసే యత్నాలను స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. మూడు వారాలుగా గ్రామంలో సేకరించిన చెత్తను తొలగించకపోవడంతో కొండల్లా పేరుకుపోయాయి. ఈ సమస్యపై పలువురు మాట్లాడుతూ, చెత్త వేసే హడ్కో కాలనీ, మాచవరం గ్రామాల్లోని పెద్దలతో అఖిలపక్ష నాయకులు, పెద్దలు చర్చించాలని అన్నారు. చెత్త వేయడం వల్ల వారికి కలిగే ఇబ్బందులు తెలుసుకుని, పరిష్కరించేలా ప్రయత్నిద్దామని చెప్పారు. గ్రామంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం లేదని, డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలాన్ని దాతల సహకారంతో కొనుగోలు చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిట్లోనే మెరుగైన వైద్య సేవలు

- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాలెంలో ఫ్యామిలీ డాక్టర్‌కు శ్రీకారం

రావులపాలెం: ప్రజలకు ఇంటి ముంగిట్లోనే మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని సచివాలయం–4 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టారని, ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి, ఒక నర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య శాఖలో వేలాదిగా నియామకాలు చేపట్టి, ప్రభుత్వ వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి ఇంటినీ ప్రభుత్వ వైద్యుడు నెలలో రెండుసార్లు కచ్చితంగా సందర్శిస్తారని, ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అనంతరం ఊబలంక పీహెచ్‌సీకి మంజూరైన 104 వాహనాన్ని జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, డాక్టర్లు షేక్ హసీనా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముమ్మిడివరప్పాడులో..

గోపాలపురం పీహెచ్‌సీ పరిధిలోని ముమ్మిడివరప్పాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి ప్రారంభించారు. ఆసుపత్రికి మంజూరైన 104 వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వైద్యాధికారి సాయి లేఖ ప్రభుత్వ ఆరోగ్య సేవలను వివరించారు. సర్పంచ్ వర్రే రేణుకా దేవి, ఎంపీటీసీ అడపా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిళ్లకుర్రులో..

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఎంపీపీ మార్గన గంగాధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్తెమ్మ కాలనీలో సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన, వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎస్‌బీ హర్ష ఆధ్వర్యాన జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రభుత్వ వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలకు చేరువ చేశారని అన్నారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల 104 వాహనాన్ని ఆయన, ఓపీ విభాగాన్ని సర్పంచ్, ఫార్మసిస్టు విభాగాన్ని ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిత్రపు ఆనంద్‌బాబు, డాక్టర్ కె.వంశీ, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎం.సుజాత పాల్గొన్నారు.

వేగివారిపాలెం, సోంపల్లిల్లో..

రాజోలు: మండలంలోని వేగివారిపాలెం, సోంపల్లి గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వేగివారిపాలెం గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్, ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్‌లు కట్టా శ్రీనివాసరావు, పప్పొప్పుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకే..



ఆలమూరు: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రవేశపెట్టిందని ఈ కార్యక్రమం జిల్లా ప్రాజెక్టు అధికారి, కొత్తపేట అదనపు డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల పీహెచ్‌సీలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 54 పీహెచ్‌సీల్లో ఎఫ్‌పీసీ సేవలు బుధవారం ప్రారంభమయ్యాయన్నారు. సుమారు 160 మంది వైద్యాధికారులు, 200 మంది ఆరోగ్య సిబ్బంది ఈ సేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారి డి.సువర్చలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని మోదుకూరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలను సర్పంచ్ పెంటపాటి శ్యామల, ఎంపీటీసీ సభ్యురాలు చుండ్రు సునీత ఆధ్వర్యాన ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సువర్చలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఎంపీపీ వీరా మల్లిబాబు సఖినేటిపల్లిలో ప్రారంభించారు. 104 వాహనంలో వైద్య సేవలను సఖినేటిపల్లి, రామేశ్వరం పీహెచ్‌సీల వైద్యాధికారులు కె.పావని, ఎండీఎంఏ యూనస్ ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ–1 రాపాక దీవెనకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా వెంకాయమ్మ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గొల్లమందల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిడుగువారిపాలెంలో..

మామిడికుదురు: పెదపట్నంలంక గిడుగువారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను సర్పంచ్ సుందరనీడి చిన్ని ప్రారంభించారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్, డాక్టర్ నితీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కొమ్ముల జంగమయ్య, అంకాడి వీరాంజనేయులు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు గెద్దం కృష్ణమూర్తి, ముత్యాల నరసింహారావు, యూవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

శానపల్లిలంకలో..

అయినవిల్లి: వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధి శానపల్లిలంకలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పీహెచ్‌సీ వైద్యులు ఎస్.సునీల్ ఆధ్వర్యాన ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్పంచ్ పంబల కుమారి, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీటీసీ సభ్యుడు పశ్చిమాల సుబ్బారావు పాల్గొన్నారు.

కె.పెదపూడిలో..

అంబాజీపేట: తొండవరం, కె.పెదపూడి సచివాలయాల వైద్యాధికారులు వి.గౌతమి, డి.గీతా గాయత్రిల అధ్యక్షతన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు ప్రారంభించారు. సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ముంగండ–2, ఎల్.గన్నవరం–2 గ్రామ సచివాలయాల పరిధిలో నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.శ్రీవల్లి, కె.సుబ్బరాజు ఆధ్వర్యాన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముంగండ సర్పంచ్ కుసుమ చంద్రకళ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ముక్కామల భారతి, అవనిగడ్డ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

దాడి చేసిన వారిపై కేసు

అయినవిల్లి: భూవివాదం నేపథ్యంలో తొత్తరమూడిలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఓ వర్గానికి చెందిన పలువురు మరో వర్గంపై దాడికి దిగి, గాయపరిచారు. దీనిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అల్లవరం మండల బోడసకుర్రుకు చెందిన కలిగినీడి చంద్రశేఖర్, మేకల ఈశ్వరరావులు తొత్తరమూడిలో 3.11 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఈ భూమిలో కంచె వేయించేందుకు గురువారం కార్మికులతో వచ్చారు. అయితే ఆ భూమి తమ స్వాధీనంలో ఉందంటూ అదే గ్రామానికి చెందిన మద్దాల తమ్మారావు వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. తమ్మారావు వర్గానికి చెందిన మద్దాల రాజా, మద్దాల రవి, ఇందుగుల ఆనంద్, తాటికాయల సుధీర్‌లు మరో వర్గానికి చెందిన కలిగినీడి చంద్రశేఖర్, మేకల ఈశ్వరరావు, ఆరవ పూర్ణచంద్రప్రసాద్, సురేంద్ర, విజయకుమార్‌లపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. చంద్రశేఖర్ కారును కూడా ధ్వంసం చేశారు. గాయపడిన వారిని అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కలిగినీడి చంద్రశేఖర్, మేకల ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మాధవాయపాలెం ఫెర్రీ వేలం ఖరారు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి – నర్సాపురం మధ్య ప్రభుత్వ గుర్తింపులో ఉన్న మాధవాయపాలెం ఫెర్రీకి నర్సాపురం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు గురువారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వివరాలను ఎంపీపీ వీరా మల్లిబాబు మీడియాకు తెలిపారు. పరిషత్ కార్యాలయంలో నర్సాపురం, సఖినేటిపల్లి ఎంపీడీఓలు ఎస్‌వీఎస్ ప్రసాద్ యాదవ్, జి.భీమారావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ సమక్షంలో ఈ రేవు వేలం పాట నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి గాను నర్సాపురానికి చెందిన సీహెచ్‌ఎస్‌వీ రెడ్డప్ప దవేజీ పేరిట రూ.3,60,99,999కు పాట ఖరారైంది. కాగా గత ఏడాది కూడా ఈ రేవు పాటను రెడ్డప్ప దవేజీ రూ.2.80 కోట్లకు పాడుకుంది.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

మామిడికుదురు: ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని, బకాయిలు వెంటనే ఇవ్వాలనే డిమాండ్లతో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో జేఏసీ చైర్మన్ దేవళ్ల శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షురాలు సీహెచ్ నాగలక్ష్మమ్మ, రెవెన్యూ ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కొత్తపేట/మామిడికుదురు/సఖినేటిపల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పతాకాన్ని పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ ఆవిష్కరించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం మాట్లాడుతూ, కేంద్రంలో అవినీతి రహిత పాలన బీజేపీకే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇళ్ల పళ్లంశెట్టి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యు.ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకలో పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ పార్టీ జెండాను ఎగురవేశారు. నియోజకవర్గ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల ఉపాధ్యక్షుడు తిరుమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మోరిపోడులో శివరామకృష్ణంరాజు, సఖినేటిపల్లిలంకలో పట్టపు సూర్య ప్రకాశరావు పార్టీ జెండాలను ఎగుర వేశారు.

'రన్ ఫర్ జీసస్' టీషర్ట్స్ పంపిణీ

సఖినేటిపల్లి: ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 8న నిర్వహిస్తున్న 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమంలో పాల్గొనే వారికి వీవీ మెరక మధ్య గ్రూపులో నిర్వాహకులు టీ షర్ట్స్ పంపిణీ చేశారు. డాక్టర్ పాలపర్తి శేఖర్ బాబు ఇంటి వద్ద ఆరాధన టీవీ ఆధ్వర్యాన వీటిని సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అందజేశారు. గాడ్స్ వే ఆర్గనైజేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.